క్లుప్తంగా

నేడు రన్ ఫర్ జీసస్



పోస్టర్లను విడుదల చేస్తున్న మండల పాస్టర్లు

సామర్లకోట: ఏసు క్రీస్తు సమాధి నుంచి లేచిన శుభవార్తను తెలియజేయడానికి శనివారం ఉదయం ఆరు గంటల నుంచి రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల పాస్టర్ల సంఘ అధ్యక్షుడు టి.బ్లెసింగ్, కార్యదర్శి కె.జయబాబు తెలిపారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ, శనివారం ఉదయం స్థానిక సీబీఎం హైస్కూల్ నుంచి బ్రౌన్‌పేట, పాత తహసీల్దార్ కార్యాలయం, బళ్ల మార్కెట్ సెంటర్, గాంధీచౌక్ నుంచి గడియారం స్తంభం చేరుకుని ప్రతిజ్ఞ చేస్తారన్నారు. అక్కడి నుంచి మఠం సెంటర్, మెహర్ కాంప్లెక్స్ ప్రభుత్వాస్పత్రి, సంత మార్కెట్ మీదుగా సెంటినరీ బాప్టిస్టు చర్చికి చేరుకుని ర్యాలీ ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు, విశ్వాసులు, పెద్దలు, యూత్, మహిళలు పాల్గొనాలని కోరారు.

మరిడమ్మ వారికి ప్రత్యేక పూజలు

పెద్దాపురం: పట్టణంలోని మరిడమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి స్వర్ణ, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అర్చకులు విజయ్, నాని, ప్రసాద్ శర్మ, వెంకటశాస్త్రి తదితరులు పంచామృతాభిషేకాలు, బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు.

పెట్రోల్ బంకుల్లో అప్రమత్తంగా ఉండాలి

- అగ్నిమాపకాధికారి రామకృష్ణంరాజు



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పిఠాపురం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పిఠాపురం పెట్రోల్ బంక్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపకాధికారి డి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ, పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు ఈ నెల 14 నుండి 20 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బైపాస్ రోడ్డులో జోగా వీరవెంకటరమణ ఫ్యూయల్ భారత్ పెట్రోల్ బంక్‌లో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పెట్రోల్–డీజిల్ ఫిల్లింగ్ చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదం జరిగితే ఎలా తప్పించుకోవాలనే దానిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెంటనే అగ్నిమాప సిబ్బందికి సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక, బంకు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ వద్ద ధర్నా

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం పోలీసు స్టేషన్ వద్ద శుక్రవారం బాధితుడి బంధువులు, కాలనీవాసులు ధర్నా చేశారు. జనచైతన్య లే అవుట్ గాంధీ బొమ్మ కాలనీకి చెందిన జనిపల్లి శ్రీనుపై దాడికి పాల్పడిన కిరాణా షాపు యజమాని, అతని అనుచరుడిపై కేసు నమోదు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. గాయపడిన శ్రీను కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని కుటుంబ సభ్యులు చెప్పారు. ధర్నాలో పాల్గొన్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ, శ్రీనుపై దాడికి పాల్పడిన కిరాణా వ్యాపారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎస్సై వీరబాబు మాట్లాడుతూ, కిరాణా దుకాణం వద్ద గురువారం సరకుల కొనుగోలుకు రూ.500 నోటు ఇవ్వగా, తిరిగిచ్చిన బ్యాలెన్స్ సొమ్ములో రూ.200 నోటుపై సిరా మరక ఉందని, మరో నోటు ఇవ్వాలని వ్యాపారిని కోరగా, శ్రీనుపై దాడికి పాల్పడినట్టు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామన్నారు. బాధితుడు జీజీహెచ్‌లో కోలుకుంటున్నట్టు తెలిపారు.

కొత్తపల్లి మండలంలో గ్రామ రెవెన్యూ అధికారుల ఫోన్ నెంబర్లు

కొత్తపల్లి:

అమీనాబాద్–1	7386077149
అమీనాబాద్–2	7780567256
గోర్స	9849656965
ఇసుకపల్లి	9849731604
కొమరగిరి–1	9704528158
కొమరగిరి–2	9502081478
కొండెవరం–1,2	9292353211
అమరవల్లి	9603221139
కొత్తపల్లి	99517307454
కుతుకుడుమిల్లి	7382541185
మూలపేట	8520884631
నాగులపల్లి–1,2	9573988008
పొన్నాడ–1	9182201374
పొన్నాడ–2	8179709758
రమణక్కపేట	9603219368
శ్రీరాంపురం	9603219368
ఉప్పాడ–1	9959218940
ఉప్పాడ–2, 3	7901016867
ఉప్పాడ–4	9866866439
వాకతిప్ప	9533535365
యండపల్లి–1	9398426606

పానీ పాట్లు..!

- నీరు పుష్కలం.. సరఫరాలో వైఫల్యం
- పిఠాపురంలో తాగునీటికి తప్పని అవస్థలు
- ఏటా రూ.2 కోట్లు నిర్వహణ ఖర్చు
- శివారు ప్రాంతాలకు అందని తాగునీరు
- అధ్వానంగా మంచినీటి పైపులైన్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

పిఠాపురం: పట్టణంలో తాగునీరు పుష్కలంగా ఉన్నప్పటికీ సరఫరా విషయంలో మున్సిపాలిటీ వైఫల్యం చెందుతోంది. శిథిలమైన పైపులైన్లు నీటి సరఫరాకు ప్రతిబంధకంగా మారాయి. జిల్లాలో ఎక్కడ లేని విధంగా పిఠాపురంలో నీటి వనరులున్నాయి. మున్సిపాలిటీ పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడంతో పలు ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. పట్టణ సమీపంలోని కుమారపురంలో 12 బోర్ల నుంచి పైపులైన్ల ద్వారా మహారాజా కోటలో నిర్మించిన రెండు స్టోరేజీ ట్యాంకులను నింపుతారు. అక్కడ నుంచి ఉదయం గంట, సాయంత్రం గంట మున్సిపల్ కుళాయిల ద్వారా ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. తాగునీటి సరఫరాకు మున్సిపాలిటీ ఏటా సుమారు సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేస్తోంది. సుమారు 52,304 మంది జనాభా, 14,498 కుటుంబాలున్న పిఠాపురంలో 119 కిలోమీటర్లు తాగునీటి సరఫరా పైపులైన్లు ఉన్నాయి. ఇంటి కుళాయిలు 4,586, వీధి కుళాయిలు 345 ఉన్నాయి. వీటికి రోజు 5.60 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉంది.

తాగు నీరందని ప్రాంతాలు

మున్సిపల్ కుళాయిల ద్వారా సక్రమంగా నీరు అందని పట్టణ శివారు ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అగ్రహారం, సీతారాంపురం, మోహన్‌నగర్, ఐతేనగర్, డ్రైవర్స్ కాలనీ, గుట్ల వీధి ప్రాంతాలకు తాగునీరు ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. వేసవిలో ఇందిరానగర్, కోటవారి వీధి, బారువవారి వీధి, వింజమూరివారి వీధి తదితర ప్రాంతాల ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా ప్రాంతాల్లో కుళాయిలు ఉన్నప్పటికీ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో పైపులైన్లు లేవు. ఉన్న ప్రాంతాల్లో కుళాయిలు ద్వారా నీరు రాదు. ఉన్న కుళాయిలు మరమ్మతులకు గురై పని చేయవు. ఇలా ఒకటి కాదు తాగునీటి సరఫరాలో అన్నీ సమస్యలే. ప్రస్తుతం వేసవి కావడంతో తాగునీటి సమస్య మరింత తీవ్రంగా మారింది.

పైపులైన్లలో సమస్యలు

వేసవి ప్రారంభానికి ముందే ప్రణాళికలు వేసి దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో పట్టణంలో తాగునీటి సమస్య తాండవిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలో సుమారు 119 కిలోమీటర్ల పొడవున పైపులైన్లు ఉన్నాయి. పలుచోట్ల ఇవి లీకులు కావడంతో సరఫరా చేస్తున్న నీరు కలుషితం అవుతోంది. కొన్నిచోట్ల కుళాయి పైపులైన్లు మురుగు కాలువ వెంబడి ఉన్నాయి. పూర్వం వేసిన ఈ పైపుల వల్ల ఇబ్బందులు ఉన్నమాట వాస్తవమేనని అధికారులూ అంగీకరిస్తున్నారు. పాత పైపులైన్ల స్థానే కొత్త వాటిని వేసేందుకు చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. నీటి పన్ను ద్వారా ఏడాదికి సుమారు రూ.80 లక్షలు మున్సిపాలిటీకి ఆదాయం రావాల్సి ఉంది. ఏనాడూ ఈ మొత్తం పూర్తిగా వసూలు కాలేదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రూ.3.56 కోట్ల కుళాయి పన్ను బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రతి ఏడాది కేవలం 60 శాతం మాత్రమే వసూలవుతోంది. బకాయిలను వసూలు చేయడం లేదు.



పిఠాపురంలో మంచినీటిని సరఫరా చేస్తున్న మున్సిపల్ ట్యాంకర్

మా వీధికే కుళాయిలు లేవు

ఇంత పెద్ద పేరున్న పిఠాపురంలో నాయకులు చెబుతున్నట్లుగా సౌకర్యాలు లేవు. అతి ముఖ్యంగా మా వీధిలో తాగునీటి కుళాయిలు లేవు. టాంకర్లతో నీరు తెస్తారు. కొందరికే సరిపోతున్నాయి. పూర్తిగా నీరు అందడం లేదు. ఎన్నిసార్లు అడిగినా కుళాయిలు వేయడం లేదు. అసలే వేసవి కావడంతో మంచినీటికి చాలా ఇబ్బందిగా ఉంటోంది. డబ్బులున్న వారు నీరు కొనుక్కుని తాగుతున్నారు. మాలాంటి పేదవారు నీటి కోసం అలమటించాల్సి వస్తోంది. గొంతెండి నరకం చవిచూస్తున్నాం. తాగునీరు సక్రమంగా అందడం లేదు. పక్క వీధిలో వీధి కుళాయిలున్నా నీరు సరిగా రాదు. ఇంటి కుళాయిలు వేయించుకున్నా ఇంతే. పైపులైన్లకు మరమ్మతులు చేయడం లేదు. ట్యాంకర్ ద్వారా సరఫరా చేసే నీరు సరిపోవడం లేదు. మంచినీటి టాంకర్ వచ్చే వరకు కాపలా కాయాల్సి వస్తోంది. మంచినీరు తెచ్చుకోవడం పెద్ద యుద్ధంగా మారింది. **– కూసి అచ్చియ్యమ్మ,** గృహిణి, ఐతే నగర్, పిఠాపురం

కాపలా కాయాల్సిందే..

పిఠాపురంలో పేదలకు మంచినీరు అందడం గగనమే. మాలాంటి వాళ్లు నీటి కోసం పడే పాట్లు పాలకులకు కనపడవు. ఓట్ల కోసం వస్తారు తప్ప మాపాట్లు చూడడానికి ఎవరూ రారు. నిత్యం మంచినీటి కోసం ఇబ్బంది పడుతూనే ఉన్నాం. కుళాయిలు అరకొరగా వస్తాయి. అదీ పైపులైన్ల మరమ్మతుల వల్ల కలుషితంగా వస్తుంటాయి. అయినా మంచినీటిని కొనే స్తోమత లేక నీరు ఎలా ఉన్నా తాగుతున్నాం. ఎండలు మండుతుంటే మంచినీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. ఎవరికి చెప్పినా పట్టించుకోరు. ప్రతి రోజు మంచినీటి కోసం ఇబ్బంది పడక తప్పడం లేదు. **– చింతపల్లి నూకరత్నం,** ఐతే నగర్, పిఠాపురం

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ పిఠాపురం సహాయ సంచాలకులు స్వాతి అన్నారు. మండలంలోని ఇసుకపల్లి, యండపల్లి గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ధాన్యం కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాల సేవలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ, అన్ని గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మధ్యవర్తులు, దళారులకంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 75 కేజీల ధాన్యం బస్తాకు రకాన్ని బట్టి సుమారు రూ.1,725కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తారని చెప్పారు. మండల వ్యవసాయాధికారి జోగిరాజు ఉన్నారు.

ఫలసాయానికి వేలం పాట

కొత్తపల్లి: వాకతిప్ప శివారున ఉన్న నాగులాపల్లి ఏరియా రక్షిత తాగునీటి ప్రాజెక్ట్ పరిధిలోని కొబ్బరి, మామిడి ఫలసాయం వేలం పాటను వారం రోజుల్లో నిర్వహిస్తామని జిల్లా పరిషత్ కార్యాలయ రెవెన్యూ అధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ పాట 2025–28 సంవత్సరాలకు సంబంధించి ప్రాజెక్ట్ పరిధిలోని 22 కొబ్బరి చెట్లు, 8 మామిడి చెట్లకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చెట్లను నరకడం, కలపను తరలించడం, పురుగు మందు పిచికారీ వంటివి చేయరాదన్నారు. ఇటీవల నిర్వహించిన ఫలసాయం పాటకు గతంకంటే ఎక్కువగా పాడకపోవడంతో వాయిదా వేశామన్నారు.

రోడ్డులో గోతులు పూడ్పించిన ట్రాఫిక్ ఎస్సై

సామర్లకోట: పట్టణంలోని స్టేషన్ సెంటర్‌లో బస్సు కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ కూడలి ప్రదేశంలో ప్రధాన రోడ్డుపై ఉన్న గోతులను ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు శుక్రవారం పూడ్పించారు. రోడ్డుకు అడ్డుగా ఐదు అడుగుల మేరకు గోయి ఏర్పడటంతో నిత్యం వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తారని తెలిసి ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా గోతులు పూడ్చారు. నాలుగు రోజులకే గోతులు యథాస్థితికి చేరాయి. దాంతో నిత్యం రద్దీగా ఉండే ఈ సెంటర్‌లో చిన్న వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులను కొంత కాలంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్సై గమనించారు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్ ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో, ఆ కాంట్రాక్టర్‌తో చర్చించి స్టేషన్ సెంటర్‌లో ప్రధాన రోడ్డుపై ఉన్న గోతులను దగ్గరుండి పూడ్పించారు. దాంతో చిన్న వాహన చోదకులు ట్రాఫిక్ ఎస్సై చొరవను అభినందించారు. ప్రజల ఇబ్బందులను ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకుంటే.. ఇటువంటి సమస్యలు ఉండవని వాహన చోదకులు చర్చించుకున్నారు.



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లోని ప్రధాన రోడ్డుపై గోతులను పూడ్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై

శాశ్వత ప్రాజెక్టులకు ఆర్థిక సంఘ నిధులివ్వండి

- సంఘ చైర్మన్‌ను కోరిన చైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో శాశ్వత ప్రాజెక్టుల నిర్మాణానికి 16వ ఆర్థిక సంఘ నిధులు అధిక మొత్తంలో విడుదల చేయాలని సంఘ చైర్మన్‌ను కోరినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ, గురువారం తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి 16వ ఆర్థిక సంఘ నిధుల కేటాయింపు సలహాలు స్వీకరణ సమావేశంలో పాల్గొన్నట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి మేయర్లు, చైర్‌పర్సన్లు 15 మందిని ఎంపిక చేయగా, వారిలో తనకు స్థానం దక్కడం ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు మున్సిపాలిటీలో తాగునీరు, పారిశుధ్యం, లైటింగ్ సమస్యలు పూర్తిగా పరిష్కరించాల్సి ఉందని, వీటికి 16వ ఆర్థిక సంఘ నిధులు ఖర్చు చేస్తామని చెప్పినట్లు వివరించారు. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మించి, ఆరోగ్యవంతమైన మున్సిపాలిటీని తయారు చేస్తామని చెప్పారు. 16వ ఆర్థిక సంఘ నిధులను ఎక్కువగా మురికివాడలకు కేటాయించి, వాటిని అభివృద్ధి చేయడం ద్వారా పట్టణాభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. ఈ మేరకు ఎక్కువ మొత్తంలో నిధులు విడుదల చేయాలని సంఘ చైర్మన్‌కు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.



సంఘ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న చైర్‌పర్సన్ అరుణ

దళారులు ధాన్యం కొంటే క్రిమినల్ కేసులు



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

- పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ నాయక్

పిఠాపురం: దళారులు తక్కువ ధరకు ధాన్యం కొంటే క్రిమినల్ కేసులు పెడతామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎండీ నాయక్ హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పిఠాపురం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కళ్లాల్లోని ధాన్యం రాశులను పరిశీలించి, ధాన్యం కొనుగోలు సిబ్బందికి పలు సూచనలు చేశారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని సత్వరం పట్టుబడి చేసి, మిల్లులకు పంపాల్సిందిగా ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఉన్న ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు తగ్గకుండా ధాన్యం షావుకారులు కానీ, మిల్లర్లు కానీ కొనాలని స్పష్టం చేశారు. మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోళ్లు జరుపుతున్నట్లు నిర్ధారణ అయితే అటువంటి వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. పిఠాపురం మండలానికి అవసరమైన గోనె సంచులను పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలకు పంపించామన్నారు. కొనుగోలు సిబ్బంది అంతా రైతుల కళ్లాలకు వెళ్లి ధాన్యం నమూనాలను సేకరించాలని ఆదేశించారు. రైతులందరినీ అప్రమత్తం చేసి మద్దతు ధర, అంతకన్నా ఎక్కువ ధరకు మాత్రమే అమ్ముకొనేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పిఠాపురం మండల వ్యవసాయాధికారి ఎ.అచ్యుతరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు

- మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య



సామర్లకోట: వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. 'నాచునీరు తాగేదెలా..' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ప్రజలకు ఎటువంటి హాని లేకుండా, నాచు రంగులో ఉన్న నీటిని శుద్ధి చేసి అందజేస్తామన్నారు. నాగార్జున చెరువును పూర్తిగా నింపినట్టు చెప్పారు. గోదావరి కాలువలో ఉన్న కలుషిత జలాలు చెరువులోకి రాకుండా, నీరు బయటకు వెళ్లకుండా చెరువు వద్ద గేట్లు పూర్తిగా మూయించామని తెలిపారు. గోదావరి కాలువలో వ్యర్థ జలాలు చేరకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఇప్పటికే వారికి కలుషిత జలాలపై ఫిర్యాదులు చేసినట్టు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో బోర్లు ఉండటంతో వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం లేదన్నారు. వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు, కాచి చల్లార్చిన నీటిని తాగడం మంచిదని కమిషనర్ సూచించారు.

సాక్షి ఇంపాక్ట్

● పడిపోతే.. ఇంతే సంగతులా..!



పిఠాపురం కుంతీమాధవ స్వామి ఆలయం వద్ద పడిపోయిన బోర్డు

పిఠాపురం: ప్రముఖ దేవాలయానికి దారి చూపే బోర్డు అది. ఓ దాత దానిని అక్కడ ఏర్పాటు చేశారు. అది ఎందరో భక్తులకు దారిచూపుతోంది. ఇటీవల వచ్చిన ఈదురు గాలులకు అది కూలిపోయింది. అంతే ఇక దానిని పట్టించుకునే వారే లేరు. బోర్డు పడిపోవడాన్ని చూసిన భక్తులు మాత్రం.. ఇదే ఏ రాజకీయ నాయకుడి పోస్టరైతే ఇలాగే వదిలేస్తారా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. కనీసం ఆలయ అధికారులైనా స్పందించాల్సి ఉండగా, వారిదీ అదే తీరు. కనీసం పట్టించుకోపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. పిఠాపురంలో అత్యంత ప్రాచీన పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన కుంతీమాధవ స్వామి ఆలయం వీధిలో ఏర్పాటు చేసిన బోర్డు ఇలా నేలకొరిగి దీనంగా చూస్తోంది.

● ఎడ్ల బండెక్కి.. పోతా పెళ్లికి..



ఎడ్ల బండిపై దర్జాగా వెళుతున్న వరుడు

పిఠాపురం: పూర్వం ఎడ్ల బండి ఉంటే.. గొప్ప హోదా ఉన్నట్టే. ఇప్పటి బెంజి కారులా అన్నమాట. కేవలం వివాహాలు వంటి శుభకార్యాలు జరిగినప్పుడు వధూవరులను తేవడానికి.. అలంకరించిన ఎడ్ల బండ్లను వినియోగించేవారు. మోటారు విప్లవం తర్వాత ఎడ్లబండి సంప్రదాయం అటకెక్కింది. ఇప్పుడు ఎంత ఖరీదైన కారులో వెళితే.. అంత గొప్ప అన్నమాట. కనుమరుగవుతున్న సంప్రదాయం అడపాదడపా కళ్లముందు సాక్షాత్కరిస్తుంటే.. ఆ అనుభూతే వేరు. పెళ్లి తంతుకు ఎడ్ల బండి, పల్లకీలు, మీనాలు, గుర్రపు బగ్గీలు వంటివి వినియోగించడం ప్రస్తుతం అక్కడక్కడా తారసపడుతుంటాయి. గొల్లప్రోలులో శుక్రవారం నిర్వహించిన గ్రంథి వారి పెళ్లిలో పెళ్లి కుమారుడు బుడగలు, కొబ్బరాకులు, అరటి చెట్లతో అలంకరించిన రంగుల ఎడ్ల బండిపై ఊరేగడం చూపరులను అబ్బురపరిచింది.

సిలువ మోసి.. రక్తం చిందించి..

- పాపుల క్షమాపణకే క్రీస్తు త్యాగాలు
- భక్తిశ్రద్ధలతో పవిత్ర శుక్రవారం
- పురవీధుల్లో ఏసు సిలువ యాత్ర

సామర్లకోట: పాపులను సన్మార్గంలో పెట్టడానికి, వారిని పాప విముక్తులను చేయడానికి క్రీస్తు చేసిన త్యాగాలు ఎనలేనివి. ముళ్ల కిరీటాన్ని ధరించినా.. సిలువనెత్తి రక్తాన్ని చిందించినా.. చిరునవ్వుతో పాపుల క్షేమాన్నే కోరుకున్నారు. ఆ దయామయుని సిలువ మోసిన రోజును స్మరించుకుంటూ క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను నిర్వహించారు. పట్టణ, మండల పరిధిలో భక్తిశ్రద్ధలతో పవిత్ర శుక్రవారాన్ని నిర్వహించారు. గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని జీసస్‌ను సిలువ వేసిన సన్నివేశాలతో స్థానిక గడియారం స్తంభం వద్ద ఆర్‌సీఎం చర్చి పాస్టర్ ఫీట్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులతో ప్రదర్శించిన ×పరిశుద్ధ సిలువ మార్గం౯ నాటిక ఆకట్టుకుంది. ఈ క్రమంలో స్టేషన్ సెంటర్ క్రైస్తవులతో కిక్కిరిసింది. భటులు ఏసుక్రీస్తుకు తలకు ముళ్ల కిరీటం ధరింపచేసి, కొరడాలతో కొడుతూ చేసిన ప్రదర్శన స్థానికులను కంటతడి పెట్టించింది. స్థానిక గడియారం స్తంభం నుంచి గాంధీచౌక్ వద్దకు చేరుకున్నాక.. క్రీస్తు వేషధారునికి సిలువ వేశారు. పురవీధుల్లో సిలువ యాత్ర కొనసాగింది. వందలాది మంది క్రైస్తవులు యాత్రలో పాల్గొన్నారు. బ్రౌన్‌పేట వద్ద పాస్టర్ల ప్రార్థనతో ఈ యాత్ర ముగిసింది. ఏసుక్రీస్తుగా కాకాడ చంద్రశేఖర్, పిలాతుగా సుధాకర్, సైనికులు, బంట్రోతులు, పుణ్యస్త్రీలుగా ఆర్‌సీఎం చర్చి సభ్యులు నటించారు. శుభ శుక్రవారం సందర్భంగా క్రైస్తవులు ఉపవాస దీక్షలు చేశారు. ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లోని చర్చిలు క్రైస్తవులతో కిక్కిరిశాయి.



సామర్లకోటలో నిర్వహించిన ఏసు సిలువ యాత్ర

ఘనంగా గుడ్ ఫ్రైడే

పిఠాపురం: పిఠాపురం నియోజకవర్గంలో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీ, కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లోని వివిధ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామాల్లో ఏసుక్రీస్తుకు శిలువ వేసిన విధానం కళ్లకు కట్టినట్టుగా చూపిస్తూ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక ప్రార్థనల్లో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

పెద్దాపురం: కట్టమూరు పుంత రోడ్డులోని కల్వరీ మిరాకల్ చర్చిలో శుక్రవారం ఘనంగా గుడ్ ఫ్రైడే నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను సంఘ కాపరి పురుషోత్తందాస్ లంక బోధించి, ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రముఖులు జేసుదాస్ లంక, మేరీ రాజకుమారి తదితరులు వర్తమానం అందించారు.



పిఠాపురంలో క్రైస్తవులు నిర్వహిస్తున్న ప్రదర్శన

నాకా బందీలో వాహనాలు సీజ్

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి 9 నుంచి 11 గంటల మధ్య జరిగిన నాకా బందీలో పోలీసులు మొత్తం 2,223 వాహనాలు తనిఖీ చేశారు. వీటిలో వివిధ కారణాలతో 61 వాహనాలు సీజ్ చేయగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్టు 15 కేసులు నమోదయ్యాయి. అలాగే పెద్దాపురం పీఎస్ పరిధిలో పది గోవులను తరలిస్తున్న మరో వాహనాన్ని పోలీసులు సీజ్ చేసి జంతు హింస చట్టం కింద కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

కాకినాడ రూరల్: మండలంలోని గైగోలుపాడు ఎస్‌బీఐ కాలనీలో పేకాట శిబిరంపై సర్పవరం పోలీసులు శుక్రవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.20,600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పెద్దిరాజు తెలిపారు.